సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 28 । జూన్ । 2024



వరమెవరికో!

మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో సిటీ, రంగారెడ్డి జిల్లాల నుంచి ఎవరికి పదవి దక్కుతుందోననే టెన్షన్ నెలకొంది.

8లో▸



చట్టాలను అమలు చేయండి

పరిశ్రమల్లో కార్మిక చట్టాలను విధిగా అమలు చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.

8లో▸



పేదల సంక్షేమానికి కృషి

పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని కలెక్టర్ శశాంక బ్యాంకర్లకు సూచించారు.

8లో▸

న్యూస్‌రీల్

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శశాంక, సీపీ తరుణ్‌జోషి

తుక్కుగూడ: జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమవంతుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ శశాంక, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం తుక్కుగూడ ఈ–సిటీ నుంచి బస్టాండ్ వరకు యువత, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యంగా నేటి యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆర్డీఓ సూరజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.వెంక్రటాం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కమల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు, కంప్యూటర్ సైన్స్, సెరికల్చర్ బోధించేందుకు ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55శాతం మార్కులతో పోస్టుగాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 50శాతం మార్కులు ఉన్న ఎస్సీ, ఎస్టీలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అదనపు విద్యార్హతలు ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు జూలై 1వ తేదీ వరకు కళాశాలలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని అన్నారు. అదే రోజు సాయంత్రం 5గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. దరఖాస్తుతో పాటు పదో తరగతి నుంచి ఉన్నత విద్యార్హతలకు సంబంధించి ధ్రువపత్రాలు జత చేయాలని, బోధన అనుభవం ఉన్న వారు సర్టిఫికెట్లను దరఖాస్తులకు జతచేయాలని సూచించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు 2024–25 విద్యా సంవత్సరంలో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్కృతం–1, స్టాటిస్టిక్స్–1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్–2 పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులతో.. ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులని చెప్పారు. ఆసక్తి గలవారు జూలై 1వ తేదీ లోపు కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఫార్మసీ కళాశాలకు న్యాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్

షాద్‌నగర్: మండల పరిధిలోని రాయికల్ శివారులో ఉన్న మూన్‌రే ఫార్మసీ కళాశాలకు న్యాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ వచ్చిందని కళాశాల చైర్మన్ పర్వత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13, 14 తేదీల్లో న్యాక్ బృందం అధికారులు కళాశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, బోధనా విధానాన్ని పరిశీలించినట్లు చెప్పారు. అన్నీ పరిగణలోకి తీసుకున్న అధికారులు న్యాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ కేటాయించినట్లు చెప్పారు.

అందేనా.. బందేనా!

గత ప్రభుత్వ హయాంలో అల్పాహార పథకానికి శ్రీకారం

- ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైనా ఊసే లేని వైనం
- స్పష్టత ఇవ్వని సర్కార్.. అధికారులు
- ఎదురుచూపుల్లో నిరుపేద విద్యార్థులు



రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో పథకం ప్రారంభమైన సందర్భం (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ప్రవేశపెట్టిన 'సీఎం అల్పాహార పథకం' అటకెక్కింది. గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు విజయ దశమి కానుకగా రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ఈ పథకాన్ని ప్రారంభించింది. తొలి విడతగా 'అక్షయపాత్ర హరేరామ' ట్రస్ట్ ద్వారా జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోఈ పథకాన్ని అమలు చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి ఆదరణ కూడా లభించింది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా అందజేసేవారు. తద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు పస్తుల బాధ నుంచి విముక్తి కలిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమి పాలవడం, పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ఉదయం పరీక్షలు, మధ్యాహ్నం తరగతులు ఉండటంతో తాత్కాలికంగా ఈ పథకానికి బ్రేక్‌పడింది. ఆ తర్వాత పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో పూర్తిగా నిలిచిపోయింది. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమైనా ఉదయం అందించే అల్పాహారం మాత్రం తిరిగి ప్రారంభం కాలేదు. దీంతో నిరుపేద విద్యార్థులకు పస్తులు తప్పడం లేదు.

గైర్హాజరు శాతాన్ని తగ్గించేందుకు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో మెజార్టీ పిల్లలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. ఆర్థిక స్తోమత లేకపోవడంతో పాటు తల్లిదండ్రులు వ్యవసాయ, ఇతర పనుల్లో బిజీగా ఉండటంతో ఉదయం వేళ వారికి ఇంట్లో అల్పాహారం సిద్ధం చేయలేని పరిస్థితి. ఉదయం తొమ్మిది గంటలకే తరగతులు ప్రారంభం అవుతుండటంతో మెజార్టీ పిల్లలు ఏమీ తినకుండానే స్కూలుకు వచ్చేవారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఖాళీ కడుపుతో ఉండేవారు. ఉదయం నుంచి ఏమీ తినకపోవడంతో కడుపునొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉత్పన్నమవుతుండేవి. తరచూ గైర్హాజరుకు కారణం అవుతుండేది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు వారి ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీఎం అల్పాహార పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడులో అమల్లో ఉన్న ఈ పథకాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని భావించింది. ఆ మేరకు అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి గత ఏడాది దసరా కానుకగా ఈ పథకాన్ని రావిర్యాల ప్రభుత్వ పాఠశాల వేదికగా ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్యలో పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థికి రోజుకో రకమైన అల్పాహారం (కిచిడి, ఇడ్లీ సాంబార్, ఉప్మా, బోండా) అందించేవారు. ఈ పథకం విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల మన్ననలను పొందింది.

జిల్లాలో 1,263 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,63,251 మంది విద్యార్థులు చదువుతున్నారు. సీఎం అల్పాహారం పథకంలో భాగంగా వీరికి రోజుకో వెరైటీ బ్రేక్‌ఫాస్ట్‌ను అందించడం ద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.400 కోట్ల మేర భారం పడనున్నట్లు అంచనా వేసింది. అయినా ఖర్చుకు వెనుకాడకూడదని నిర్ణయించింది. అప్పటికే మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్న ప్రభుత్వం.. కొత్తగా అల్పాహార పథకాన్ని అమల్లోకి తీసుకురావడంతో ఇటు

ఖాళీ కడుపుతో విద్యార్థులు

ఉపాధ్యాయవర్గాల్లోనే కాకుండా అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇవి ఎక్కువ కాలం నిలబడలేదు. పదో తరగతి వార్షిక పరీక్షల సమయంలో అల్పాహారం సరఫరా నిలిచిపోయింది. వరుస వేసవి సెలవులు దీనికి తోడయ్యాయి. సెలవులు ముగిసి, మళ్లీ పాఠశాలలు తెరుచుకున్నా ఇప్పటి వరకు సీఎం అల్పాహారం అమలు చేయకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పథకం తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశంపై కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లోనే కాదు విద్యాశాఖ అధికారుల్లోనూ స్పష్టత లేకుండా పోయింది.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

చట్టాలపై అవగాహన తప్పనిసరి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

యాచారం: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు, గృహ హింస, బాలల చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా, బలవంతం, బెదిరింపులకు గురి చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. దోపిడీలకు పాల్పడడం, వ్యభిచారం, అవయవ వ్యాపారం, లైంగిక దోపిడీ, బలవంతపు శ్రమ, భానిసత్వం, అవమానించడం వంటి విషయాలపై చట్టాలు కఠినంగా ఉన్నాయని వివరించారు. సమాజంలో గౌరవ ప్రదమైన జీవితాన్ని పొందే హక్కు భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిందని గుర్తు చేశారు. రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నకిలీ విత్తనాలు, నాసిరకమైన ఎరువులు, పురుగుమందులు వాడి నష్టపోయినప్పుడు కోర్టులకెళ్లి బాధ్యులైన వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తగిన పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నక్కర్తమేడిపల్లి ఎంపీటీసీ సభ్యురాలు మొరుగు శివలీల, గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ప్రసాద్, మాజీ సర్పంచులు బోడ కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, ప్యారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

'మైసిగండి'కి భారీగా ఆదాయం

కడ్తాల్: మైసిగండిలో కొలువైన మైసమ్మ తల్లి ఆలయ పరిసరాల్లో 2024–25 సంవత్సరానికి సంబంధించి శాక్తేయ మొక్కులకు రుసుం వసూలు, పూజాసామగ్రి విక్రయించుకునే హక్కులకు సంబంధించి గురువారం దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ముందుగా శాక్తేయ మొక్కుల రసీదు రుసుం వసూలు చేసుకునే హక్కుకు సంబంధించి వేలంపాట నిర్వహించగా మొత్తం ముగ్గురు పాల్గొన్నారు. అందులో రూ.25.15 లక్షలకు మైసిగండికి చెందిన దేపావత్ రవి దక్కించుకున్నాడు. అనంతరం ఆలయ పరిసరాల్లో పూజా సామగ్రి విక్రయించుకునే హక్కుకు వేలం పాట నిర్వహించగా ముగ్గురు పాల్గొన్నారు. అందులో మైసిగండికి చెందిన రాజేశ్ రూ.15.41 లక్షలకు దక్కించుకున్నాడు. వేలం ద్వారా ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈవో స్నేహలత, రామవత్ భాస్కర్‌నాయక్, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు



జంగారెడ్డిపల్లిలో పత్తిసాగు చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి
- జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి
- ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ఆమనగల్లు: విత్తనాలు, ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి హెచ్చరించారు. రైతులు పొలాల్లో తేమ ఉన్నప్పుడే విత్తనాలు నాటుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని వివిధ ఎరువుల షాపులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో ఉన్న స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. గోదాముల్లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. వానాకాలం పంటలకు సంబంధించి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించి రసీదులు విధిగా ఇవ్వాలని ఆదేశించారు. డీలర్లు ఈ పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. రోజువారీగా ఈపాస్‌ద్వారా అమ్మిన స్టాకును తీసివేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆమె సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని జంగారెడ్డిపల్లి సమీపంలో ఆమె రైతులతో మాట్లాడి ఏ రకం పత్తి విత్తనాలు వేస్తున్నారు.. ఎలా విత్తుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. కొరత ఉన్న కొన్ని రకాల పత్తి విత్తనాల విషయంలో ఆందోళన చెందొద్దని, అధీకృత డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న విత్తనాలను ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ వద్దేవద్దు

- అంతారంలో మైనింగ్ జోన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ
- అనుమతులు వద్దంటూ తేల్చిచెప్పిన గ్రామస్తులు

చేవెళ్ల: తమ గ్రామానికి, ప్రజలకు, పశువులకు, పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న మైనింగ్‌జోన్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని మండలంలోని అంతారం గ్రామస్తులు తేల్చిచెప్పారు. గ్రామ సమీపంలోని పంచలింగాల గుట్ట వద్ద కొన్నేళ్లుగా ఎస్‌ఆర్ మినరల్స్ మైనింగ్ తవ్వకాలు జరుపుతోంది. ఇటీవల మరో 27 ఎకరాల్లో అనుమతులు కోరగా దీనిపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. పొల్యూషన్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీవాత్సవ్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు, ఎన్జీఓలు, గ్రామస్తులు, రైతుల సమక్షంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అనుమతులు వద్దంటే వద్దంటూ ముక్తకంఠంతో నినదించారు. దీనిపై గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు చెప్పారు. కొన్నేళ్లుగా జరుగుతున్న ఈ మైనింగ్‌తో తమ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, పశువులు, పర్యావరణానికి ముప్పు ఉందని స్పష్టం చేశారు. పలు ఎన్జీవోల సభ్యులు, మైనింగ్ యాజమాన్యాలు మాట్లాడేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు వారిని అడ్డుకున్నారు. గతంలో కూడా వ్యతిరేకించినా అనుమతులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోనప్పుడు ఈ ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పారు. అనంతరం గ్రామస్తులు చేసిన తీర్మానంతోకూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ సాయిరాంకు అందజేశారు. చేవెళ్ల ఏసీపీ కిషన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అంజయ్యగౌడ్, వెంకటేశ్‌బాబు, నరేందర్, సుధాకర్, వీరస్వామి, మాణిక్యం, తరుణ్, పాష, దేవేందర్, సంజీవ్‌కుమార్, రవికిషోర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులను సముదాయిస్తున్న పోలీసులు

ఫార్మా భూముల్లో పరిశ్రమలు, టౌన్‌షిప్‌లు వద్దు



తాడిపర్తిలో స్థానికులతో మాట్లాడుతున్న దేశ్‌రాథ, కవుల సరస్వతి

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో పరిశ్రమలు, టౌన్‌షిప్‌లు నిర్మించి ఈ ప్రాంతాన్ని కలుషితం చేయొద్దని మహారాష్ట్ర ప్లానింగ్ కమిటీ మాజీ సభ్యుడు దేశ్‌రాథ పేర్కొన్నారు. పర్యావరణ వేత్త కవుల సరస్వతితో కలిసి గురువారం ఆయన ఫార్మాసిటీ కోసం భూములు సేకరించిన కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లో పర్యటించారు. తాడిపర్తిలో గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేయడం సంతోషమే కానీ కొత్త పరిశ్రమలు, టౌన్‌షిప్‌లు నిర్మిస్తామని పేర్కొనడం సరైంది కాదని అన్నారు. పరిశ్రమలు, రియల్ వ్యాపారంతో వ్యవసాయ భూములు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం లేని ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తూనే వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

పింఛన్లు పెంచాలి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెలకు దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు పెంచుతామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా పింఛన్లు పెంచకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దివ్యాంగులకు గుర్తింపును తీసుకొచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో పింఛన్లపై సమరభేరి మోగించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వచ్చేనెల 5న కలెక్టరేట్ ముట్టడి, 6 నుంచి 16వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేయనున్నట్టు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, శ్రీనివాస్, జంగయ్య, యాదయ్య, బాల్‌రాజు, సలీం, సతీష్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీలత

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం: మహిళలు ఆర్థికంగా ఎదగడమే గాకుండా ఇతరులకు పని కల్పించేవిధంగా వారి జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీలత అన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే మహిళలకు ఆర్టిఫిషియల్ జ్యువెలరీ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఇబ్రహీంపట్నంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి హామీ కింద వంద రోజులు పని పూర్తి చేసుకున్న మహిళలు అనంతరం కూలీ పనుల మీద ఆధారపడకుండా సొంతంగా ఎదిగేందుకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 24 వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కూలీల కుటుంబం నుంచి ఒకరికి చొప్పున 75 మందికి తొలివిడత శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రం ఇవ్వడమే గాక బ్యాంకు ద్వారా ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.రమేష్, అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి, ఏపీడీ సక్రియనాయక్, ఎంపీడీఓ వెంకటమ్మ, ట్రైనర్స్ రాజేశ్‌చవాన్, శ్రీదేవి, మురళి, సుజాత, జైప్రకాశ్, ఏపీఓ తిరుపతాచారి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి చేయాలి



జిల్లా బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

- డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో కలెక్టర్ శశాంక
- రూ.49 వేల కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల

ఇబ్రహీంపట్నం రూరల్: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని కలెక్టర్ శశాంక బ్యాంకర్లకు సూచించారు. కలెక్టరేట్ మందిరంలో గురువారం డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. 2024– 25 సంవత్సరానికి ఉద్దేశించి రూ.49,815.36 కోట్లతో జిల్లా వార్షిక ప్రణాళికను కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పథకాలను అమలు చేయడంలో బ్యాంకులు తమ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లా క్రెడిట్ ప్లాన్ని రూ.49,815.36 కోట్లతో గత సంవత్సరం కంటే రూ.25,648.36 కోట్ల పెరుగుదలతో 28.17 శాతం వృద్ధిని అంచనా వేశామని తెలిపారు. వ్యవసాయ రంగానికి రూ.6,166.81 కోట్ల ప్రాధాన్యత నుంచి రూ.15,086.07 కోట్ల మేజర్ కాంపోనెంట్ ఎంఎస్ఎంఈకి కేటాయించామన్నారు. బ్యాంకులు లేని గ్రామాలలో తగిన సంఖ్యలో బీసీ పాయింట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి అకౌంట్కు ఆధార్కార్డు, పాన్కార్డు సీడ్ చేయాలని తెలిపారు. ఆపరేటీవ్ ఖాతాల కోసం మొబైల్ నంబర్, పెన్షన్, రైతుబంధు, గ్యాస్ సబ్సిడీ, పీఎం కిసాన్, సమ్మాన్ నిధి వంటి డీబీటీ ప్రయోజనాలను పొందుటకు లబ్ధిదారులకు సులభతరం చేయడానికి పీఎంజేజేబీవై, పీఎం ఎస్బీవై బీమా పథకాల క్రింద ఖాతాదారులందిరినీ కవర్ చేయాలన్నారు. జిల్లాలో బ్యాంకర్లు, జిల్లా అధికారులు అందరూ సమష్టిగా కృషి చేసి జిల్లా అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. జిల్లాలో ఆర్థిక సహాయ పథకాలను అందజేసి లక్ష్యాలను సాధించినందుకు బ్యాంకర్లు, సెక్టోరియల్ హెడ్లు, డీఆర్డీఏ, డీపీసీ, సెర్ప్, మెప్మా అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్బ్యాంకు మేనేజర్ కుసుమ, ఆర్బీఐ అధికారి నాబార్డు ఏజీఎం, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, జిల్లా గ్రామాణాభివృద్ధి అధికారి శ్రీలతతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

షాద్నగర్ నూతన సీఐగా నర్సింహ

షాద్నగర్రూరల్: షాద్నగర్ పట్టణ నూతన సీఐగా కేతూరి నర్సింహను నియమిస్తూ సైబరాబాద్ సీపీ మహంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ సీఐగా పని చేస్తున్న ప్రతాప్ లింగంను వీఆర్లో ఉంచారు. అయితే మేడ్చల్ జోన్లో సీసీఎస్లో పని చేస్తున్న కేతూరి నర్సింహ్మ షాద్నగర్ పట్టణ పోలీస్స్టేషన్కు సీఐగా బదిలీపై రానున్నారు.

జల్సాల కోసం.. చోరీలకు పాల్పడి

ముగ్గురు బైక్ దొంగల రిమాండ్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

మీర్పేట: జల్సాలకు అలవాటు పడి.. ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడే ముగ్గురు దొంగలను మీర్పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. గురువారం మీర్పేట పోలీస్స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు జైపురికాలనీకి చెందిన జూలు ప్రవీణ్ (36), బండ్లగూడకు చెందిన డేరంగుల సత్యం(34), మీర్పేట జనప్రియ కాలనీకి చెందిన విజయ్కృష్ణ(36)లు స్నేహితులు కావడంతో పాటు బైక్ మెకానిక్లుగా పనిచేస్తున్నారు. ముగ్గురు జల్సాలకు అలవాటు పడి వైన్షాపులు, విద్యాసంస్థల వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి నంబర్ ప్లేట్లను తుడిచేసి గుర్తు పట్టకుండా విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మీర్పేట పరిధిలో 11 వాహనాలను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఐ గౌరినాయుడు, క్రైం సిబ్బంది, నగేష్, ఎల్లయ్య, శివరాజ్, విజయ్కుమార్, నవీన్కుమార్, ప్రకాశ్గౌడ్ ఉన్నారు.

వరమెవరికో!

మహా నగరం నుంచి మంత్రి అయ్యేదెవరో?



- త్వరలో రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ
- ఆశావహుల్లో మల్రెడ్డి, రామ్మోహన్రెడ్డి , దానం

సాక్షి, రంగారెడ్డి జిల్లా : త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జంట జిల్లాల నుంచి ఎవరికి మంత్రి పదవి దక్కుతుందన్నది అటు రాజకీయ వర్గాల్లోనే కాక ఇటు సాధారణ ప్రజల్లోనూ ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు దాదాపుగా నగరంలోనే కలగలిసి ఉండటంతో ఈ జిల్లాల నుంచి ఎవరిని మంత్రి పదవి వరించినా వారిని మహానగరానికి ప్రాతినిధ్యం వహించే వారుగానే పరిగణించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండు జిల్లాల నుంచి ఎవరికీ మంత్రి పదవి లభించలేదు. జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి ఏ ఒక్కరు కూడా ఎమ్మెల్యేగా గెలవలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ముగ్గురు గెలవగా వారిలో గడ్డం ప్రసాద్కుమార్కు స్పీకర్ పదవి ఇచ్చారు. దీంతో మిగతా ఇద్దరు ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్రెడ్డి తమకు మంత్రి పదవి లభించనుందనే ఆశతో ఉన్నారు.

ఒకరికి ఖాయం?

రెండు జిల్లాల నుంచి ఎవరూ లేకపోవడంతో ఒకరికి ఖాయంగా లభించనుందని రాజకీయ పరిశీలకులు కూడా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లో చేరిన దానం నాగేందర్ సైతం మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. బహుశా ఆ ఆశతోనే ఆయన సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు తొలుత ససేమిరా అన్నప్పటికీ, పోటీ చేయక తప్పలేదు. బీఆర్ఎస్ డిమాండ్ చేసినా ఎమ్మెల్యే పదవికి రాజీనామా కూడా చేయలేదు. ఎంపీ ఎన్నికలో ఆయన ఓడిపోయినప్పటికీ, బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరిన ఆయనకు మంత్రి పదవి లభించవచ్చని భావిస్తున్న వారు ఉన్నారు. దానం హైదరాబాద్ జిల్లాలోని ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. హైదరాబాద్ జిల్లాకే మంత్రి పదవి ఇవ్వాలని భావించే పక్షంలో ఆయనకు, జంట జిల్లాలనుంచి ఎవరో ఒకరికి ఇవ్వాలని భావిస్తే మల్రెడ్డి రంగారెడ్డి లేదా రామ్మోహన్రెడ్డిలలో ఎవరో ఒకరికి మంత్రి పదవి లభించనుంది. ఎంతో కాలం జంట జిల్లాలుగా కొనసాగిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం లేని మంత్రివర్గమంటూ కూడా ఎప్పుడూ లేదు. అంతేకాదు.. జంట జిల్లాల నుంచి ఒకే మంత్రివర్గంలోనే ముగ్గురికి కూడా మంత్రి పదవులు లభించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

రాజధానికి ప్రాతినిధ్యమేదీ?

రాజధాని నగరమైన హైదరాబాద్లో జరిగే పలు కార్యక్రమాల్లో నగరానికి చెందిన మంత్రి అంటూ లేకుండాపోయారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, పండుగలు, ఉత్సవాల వంటి కార్యక్రమాలతో పాటు వానలు, వరదలు వంటివి సంభవించినప్పుడు ప్రజల మధ్యకు వచ్చి భరోసానిచ్చేందుకు కూడా నగరం నుంచి మంత్రి అనేవారే లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాకు ఇన్చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న పొన్నం ప్రభాకర్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నగర పరిపాలనా కేంద్రమైన జీహెచ్ఎంసీకి సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలు, వర్షాకాల కార్యాచరణ వంటి కార్యక్రమాలపై సమీక్షలు సైతం ఆయనే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ విధంగా చూసినా మహానగరం నుంచి మ్రంతి పదవి ఖాయంగా కనిపిస్తుండటంతో ఆ అదృష్టం వరించేది ఎవరిని అన్నదే ఇప్పుడు ఉత్కంఠ కలిగిస్తోంది.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

చేవెళ్ల: హరితహారంలో రోడ్డు వెంబడి నాటిన చెట్లను ఎందుకు నరికేస్తున్నారని ప్రశ్నించినందుకు మాజీ సర్పంచ్ భర్తపై విద్యుత్ కాంట్రాక్టర్ సిబ్బంది దాడి చేశారు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్స్టేషన్ పరిధిలోని న్యాలట గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు సత్యనారాయణ వివరాల ప్రకారం.. గ్రామంలో రోడ్డు వెంట హరితహారంలో నాటిన చెట్లు పెద్దవిగా పెరిగాయి. గురువారం సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న చెట్లను విద్యుత్ సిబ్బంది నరికేస్తున్నారు. అటువైపుగా వెళ్తున్న గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మి భర్త సత్యనారాయణ చూసి ఎందుకు చెట్లు నరుకుతున్నారని అడిగాడు, వారు విద్యుత్ కాంట్రాక్టర్ బాపిరెడ్డి నరికేయమన్నారని చెప్పారు. వెంటనే అతడు బాపిరెడ్డికి ఫోన్చేసి అడిగారు. నేను చెట్లు నరికివేయమని చెప్పలేదని, కొమ్మలు కొట్టేయాలని చెప్పానన్నాడు. దీంతో అతడు కోపంగా చెప్పలేదంట కాదా అని బెదిరించాడు. ఆగ్రహించిన సిబ్బంది అతనిపై దాడి చేశారు. గ్రామస్తులతో కలిసి సత్యనారాయణ చేవెళ్ల పోలీస్స్టేషన్లో కాంట్రాక్టర్ బాపిరెడ్డి, అతని సిబ్బందిపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా వాచ్మెన్ మృతి

మృతదేహంతో అపార్ట్మెంట్ ఎదుట నిరసన



మృతదేహంతో నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పదంగా వాచ్మెన్ మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన లాపంగి రామయ్య(42), భార్య ముగ్గురు పిల్లలతో కలిసి ఆదిబట్ల సమీపంలోని టీసీఎస్ పక్కనే ఉన్న సాయితేజ అపార్ట్మెంట్లో వాచ్మెన్ ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం లిఫ్ట్లో ఎక్కి కిందికి వస్తుండగా లిఫ్ట్లో రామయ్య పడిపోయి ఉన్నాడు. అపార్ట్మెంట్లో ఉండే వారు గమనించి, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి రామయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాధిత కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అపార్ట్మెంట్ ఎదుట ఉంచి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసే వరకు కదిలేది లేదని నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆదిబట్ల పోలీసులు అక్కడి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించారు.

బిర్యానీ తిని, కూల్డ్రింక్స్ తాగి..

ఇంట్లో చోరీకి వచ్చిన దొంగల దర్జా

పహాడీషరీఫ్: ఇంట్లో చొరబడ్డ దొంగలు నింపాదిగా ఫ్రిజ్లో ఉన్న బిర్యానీ వేడి చేసుకొని ఆరగించి, శీతల పానియాలు సేవించి అందిన కాడికి దోచుకెళ్లిన ఘటన బాలాపూర్ పోలీస్స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. కొత్తపేట నబీల్ కాలనీకి చెందిన ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లారు. తాళం పగులకొట్టి ఉన్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న వారు వచ్చి చూడగా ఇంట్లోని సామగ్రి మొత్తం చిందర వందరగా పడేశారు. ఇంటిలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు ఎత్తుకెళ్లారు. చివరకు ఫ్రిజ్లో ఉంచిన బిర్యానీని వేడి చేసుకొని తిని, జ్యూస్ తాగి వెళ్లిన ఘటనపై బాధిత మహిళ సోషల్ మీడియా ద్వారా గోడు వెల్లబోసుకుంది. వారం రోజుల క్రితం కూడా నల్లా పైపులు తీసుకెళ్లారని పేర్కొంది. బాలాపూర్ పోలీసులు స్పందించి దొంగలను గుర్తించి చోరీ సొత్తును రికవరీ చేయాలని కోరింది. కాగా, ఈ ఘటనపై బాలాపూర్ పోలీసులు గోప్యత పాటిస్తున్నారు.

శవంతో ఆస్పత్రి ఎదుట ధర్నా

వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఆరోపణ



ఆందోళన చేపట్టిన మృతుడి కుటుంబ సభ్యులు

షాద్నగర్రూరల్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ గురువారం సాయంత్రం పట్టణంలోని బుగ్గారెడ్డి ఆస్పత్రి ఎదుట శవంతో మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన చిర్ర మహేశ్(45) మధుమేహంతో బాధ పడుతుండటంతో గతవారం క్రితం షాద్నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి ఆస్పత్రికి తీసుకొచ్చారు. వారం రోజుల పాటు హాస్పిటల్లో వైద్యులు మహేశ్కు చికిత్స చేశారు. ఆయనకు కిడ్నీల సమస్య ఉందని, డయాలసిస్ చేయించాలని వైద్యులు సూచించగా హైదరాబాద్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డయాలసిస్ చేసిన మరుసటి రోజే మహేశ్ మృతి చెందారు. అయితే షాద్నగర్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మహేశ్ మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. వారం రోజుల పాటు చికిత్స నిర్వహించి వైద్యులు కాలయాపన చేయడంతోనే మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేంత వరకు ఆందోళనను విరమించబోమని కుటుంబసభ్యులు, బంధువులు పట్టుబట్టారు. ఈ మేరకు మృతదేహంతో ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టిన వారిని సముదాయించారు.

కార్మిక చట్టాలను అమలు చేయండి



కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్నగర్: పరిశ్రమల్లో కార్మిక చట్టాలను విధిగా అమలు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర లేబర్ కమిషనర్ కృష్ణ ఆదిత్యను కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఎమ్మెల్యే ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షాద్నగర్ ప్రాంతంలో ఏర్పాటైన పరిశ్రమల్లో కార్మిక చట్టాలు సరిగ్గా అమలు కాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చాలా పరిశ్రమల్లో కార్మికులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో యజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. అలాంటి పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వడం లేదని, శ్రమ దోపిడీకి గురవుతున్నారని దుయ్యబట్టారు. షాద్నగర్ ప్రాంతంలో చాలా పరిశ్రమలు స్థాపిస్తున్నా.. వాటిలో స్థానికులకు ఉపాధి లభించడం లేదని తెలిపారు. స్థానికులకు ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు అధికారులు అండగా నిలిచి చట్టాలు కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘు ఉన్నారు.

బాలిక అదృశ్యం



దేబోకీ కర్మేరియా(ఫైల్)

పహాడీషరీఫ్: మతిస్థిమితం సరిగ్గా లేని బాలిక అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం .. ఒడిశా రాష్ట్రానికి చెందిన కైలాస్ భార్య, పిల్లలతో కలిసి నగరానికి వలస వచ్చి బాలాపూర్లో నివాసం ఉంటున్నారు. అతని చిన్న కుమార్తె దేబోకీ కర్మేరియా(10), మానసికస్థితి సరిగ్గా లేదు. ఈ నెల 26వ తేదీన భార్యాభర్తలు పనికి వెళ్లి మధ్యాహ్నం వచ్చి చూడగా కనిపించ లేదు. పక్కనున్న వారి అడగ్గా చిన్నారులతో ఆడుకుందని, వారితో ఒడిశా వెళ్తునని ఆర్సీఐ రోడ్డు వైపు వెళ్లినట్లు తెలిసింది. స్థానికంగా వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్ పోలీస్స్టేషన్ 87126 62366 నంబర్కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఆల్బెండజోల్తో నులిపురుగుల నివారణ



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న విజయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

షాద్నగర్: నులిపురుగుల నివారణకు విధిగా మాత్రలు వేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఫరూఖ్నగర్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ.. పిల్లల కడుపులో నులిపురుగులు ఏర్పడితే రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరుగు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. సంవత్సరం నుంచి 19ఏళ్ల వయస్సు ఉన్న బాలబాలికలు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు వేడి పదార్థాలు తినాలన్నారు. కలుషితమైన ఆహారం, ఈగలు, దుమ్ముధూళి చేరిన ఆహారం తినొద్దని సూచించారు. అన్ని పాఠశాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెచ్ఎం శంకర్, ఏఎన్ఎం స్వప్న, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

'మౌంట్ దెనాలి'పై నగర బాలుడు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన 15 ఏళ్ల విశ్వనాథ్ కార్తికేయ అలస్కా–ఉత్తర అమెరికాలోని ఎత్తైన శిఖరం 'మౌంట్ దెనాలి'ని అధిరోహించాడు. 11వ తరగతి చదువుతున్న విశ్వనాథ్ సముద్ర మట్టానికి 6,190 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ దెనాలిని అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేశాడు. జూన్ 15న అధిరోహణను ప్రారంభించి వారం తర్వాత శిఖరాగ్రానికి చేరుకున్నాడు. ఏడు ఖండాలలో ఇప్పటి వరకు 4 పర్వతారోహణలు పూర్తి చేశాడు.